మూగజీవాలకు నీటిగోస

- మరమ్మతులకు నోచుకోని నీటితొట్లు
- వినియోగంలో లేక శిథిలావస్థకు..
- ఇబ్బందుల్లో పశువుల కాపరులు



చిన్న దేవిసింగ్ తండాలో తొట్టిలో నీళ్లు లేక పక్కనే మురికి నీటిని తాగుతున్న పశువులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : దాహం తీర్చుకునేందుకు పశువులు నానా ఇబ్బందులు పడుతున్నాయి. ఈ వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండనున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంటుండడంతో పరిస్థితి అధ్వానంగా మారే పరిస్థితి ఉందని పశువుల కాపరులు వాపోతున్నారు. గ్రామలలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామంలో నీటితొట్లు నిర్మించింది. కాని వాటిలో నీళ్ల పోసే పైప్‌లైన్ సౌకర్యం లేకపోవడంతో అవి వృథాగా మారాయి. కొన్నిచోట్ల తొట్లు ధ్వంసమయ్యాయి. రూ. వేలల్లో ఖర్చు చేసి ఏర్పాటు చేసిన తొట్లు పనికి రాకుండా పోయాయి. ఒక నీటి తొట్టికి సుమారు రూ. 12 వేల నుండి రూ. 30వేల వరకు వెచ్చించి నిర్మించారు.

ఆయా ప్రాంతాల్లో..

మండలంలోని బేగంపూర్, కాస్లాబాద్, చిన్న దేవిసింగ్ తండా, కాటేపల్లి, బురుగుపల్లి, సర్దార్ తండా, చావుని తండాతో పాటు పలు గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్లు ధ్వంసమయ్యాయి. మరికొన్ని వృథాగా మారాయి. చిన్న దేవిసింగ్ తండాలో తొట్టిలో నీళ్లలేక పశువులు మురికినీళ్ల తాగుతున్నాయి.

నీరందేలా చూడాలి



మా తండాలో ఎక్కువ పశువులు ఉన్నాయి. వేసవికాలంలో పశువుల దాహార్తి తీర్చిందుకు చాలా ఇబ్బందిగా ఉంది. తొట్టిలు నిర్మించినప్పటికీ వృథాగా ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేయించి నీటిని నింపాలి.

– సకారాం, చిన్నదేవిసింగ్ తండా

నీటి తొట్టీలు ఏర్పాటు చేయాలి



వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని తండాల్లో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్లును ఏర్పాటు చేయాలి. ప్రతి ఏడాది వేసవిలో పశువులకు నీరు దొరక్క రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీళ్ల దొరక్క కొంతమంది రైతులు పశువులను విక్రయిస్తున్నారు.

– గోతి జగదీశ్, టీకారం తండా

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు



హాల్ టికెట్ నెంబర్లు వేస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డి: నేటి నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ఎంఈవో వెంకటేశం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మోడల్‌స్కూల్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలో మూడు పరీక్షా కేంద్రాలలో 722 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

సదాశివనగర్‌లో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : టెన్త్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంఈవో యోసెఫ్ తెలిపారు. టెన్త్ పరీక్షల నిర్వహణ కోసం సదాశివనగర్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అడ్లూర్‌ఎల్లారెడ్డి, కల్వరాల్ గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో 639 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు.

మైలారం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మహేందర్ గౌడ్



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం, లింగంపల్లి, అంకోల్ తండా గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు నందు రెడ్డి తెలిపారు. మైలారం గ్రామ పార్టీ అధ్యక్షులుగా గడ్డం మహేందర్ గౌడ్, లింగంపల్లి అధ్యక్షుడిగా లకావత్ శంకర్, అంకోల్ తండా అధ్యక్షుడిగా బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, మాజీ సర్పంచ్ అరిగె సాయిలు, అన్నం సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మనిషిలో సుఖ:దుఖాలు సహజం'



కామారెడ్డి అర్బన్ : మనిషి జీవితంలో దుఃఖం, బాధలు అనివార్యమైనవిగా గుర్తించి వాటిని అధిగమించడానికి ఆధ్యాత్మిక భావన, జ్ఞానం, యోగా, ధ్యానం, శారీరక శ్రమతో మానసిక ప్రశాంతత పొందాలని ఆచార్య సత్యమిత్ర్య ఆర్య అన్నారు. స్థానిక సిరిసిల్ల రోడ్డు లోని శ్రీకృష్ణ గీతామందిరం వార్షికోత్సవం సందర్భంగా రెండో రోజు ఆదివారం సాయంత్రం ఆచార్య సత్యమిత్ర ఆర్య ఉపనిషత్తుల సారం ప్రవచనం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గీత మందిరం ప్రతినిధులు పాత అశోక్, పార్శి రాజేందర్ తదితరులున్నారు.

క్లుప్తంగా

గ్రంథాలయానికి పుస్తకాలు మంజూరు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు వచ్చినట్లు గ్రంథపాలకుడు రాజలింగం తెలిపారు. గ్రూపు1, 2, 3, 4 డీఎస్సీ, టెట్, బీఈడీలకు సంబంధించిన రూ. 20 వేల విలువున్న పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు.

తాగునీటిలో కప్పల కళేబరాలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని మౌకాన్‌ఖేడ్ గ్రామంలోని వాటర్ ట్యాంక్‌లో కప్పల కళేబరాలు తేలి ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి ట్యాంక్‌లో చనిపోయిన కప్పల కళేబరాలు రావడంతో నీరు కలుషితంగా మారిందన్నారు. అధికారులు నీటి ట్యాంక్‌లను శుభ్రపర్చడంలో అలసత్వం వహించడంతో ఇలాంటి సంఘటనలో చోటు చేసుకుంటున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు.

లింగంపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు నందు రెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా గ్రామ పార్టీ అధ్యక్షులుగా లకావత్ శంకర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దివిటి శ్రీనివాస్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, మాజీ సర్పంచ్ అరిగె సాయిలు, అన్నం సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్ గౌడ్ అన్నారు. పంచాయతీ కార్మికులతో సమావేశమయ్యారు. ఎనిమిది నెలల జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. 51.జీవోను రద్దు చేయాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని కొనసాగించాలని, కారోబార్, బిల్ కలెక్టర్‌లకు ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలన్నారు. రూ. 5లక్షల ఇన్సూరెన్స్‌ను అమలు చేయాలన్నారు. ఈనెల 21న నిర్వహించే చలో కమిషనరేట్ ధర్నాను సక్సెస్ చేయాలన్నారు. కార్మిక సంఘం ప్రతినిధులు బాల్‌నర్సు, సాయిలు, మల్లేశ్, శ్రీను తదితరులున్నారు.

నియామకం



బాన్సువాడ : ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ జిల్లా చైర్మన్‌గా శ్రీనివాస్‌రావును నియమించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ తెలిపారు. ఆదివారం బాన్సువాడలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వాగ్మారే బాలు, ఉపాధ్యక్షులుగా సాయిలు, కోడం రాజు, కోశాధికారిగా రాజారాం, సహాయ కార్యదర్శిలుగా విజయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొప్పని శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం





బాన్సువాడలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రెడ్డి సంఘం సభ్యులు, దోమకొండలో..

బాన్సువాడ : బాన్సువాడలో ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం అధ్యక్షులు మాసాని అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డిల సంక్షేమం కోసం రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

రెడ్డి కులస్తులు మాసాని శేఖర్‌రెడ్డి, పాశం రాజిరెడ్డి, ఎరువల లక్ష్మారెడ్డి, మాసాని రవీందర్‌రెడ్డి, లింగాల గంగారెడ్డి, విఠల్‌రెడ్డి, సాయిరెడ్డి, నాగిరెడ్డి, మేఘంరెడ్డి, కృష్ణరెడ్డి తదితరులు ఉన్నారు.

దోమకొండలో..

దోమకొండ : మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సంఘం ప్రతినిధులు పాలాభిషేకం చేశారు. పద్మశాలి సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చే సినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మ్యాక నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొమ్మెర గంగాధర్, ప్రతినిధులు తదితరులున్నారు.

పథకాలను గడపగడపకూ వివరించాలి



బాన్సువాడ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు కిషోర్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని తాడ్కోల్, బుడిమి, తిర్మలాపూర్, బోర్లం గ్రామాల్లో గ్రామ కాంగ్రెస్ కమిటీల పునఃవ్యవస్థీకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బోర్లం గ్రామ అధ్యక్షుడిగా గడ్డం సతీష్‌గౌడ్, తాడ్కోల్‌కు బేగరి దత్తు, బుడ్మి అధ్యక్షులుగా జిలకర రమేష్, తిర్మలాపూర్ గ్రామ అధ్యక్షుడిగా వడ్ల రాజును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు మధుసూదన్ రెడ్డి, మంత్రి గణేష్, ఉద్దర హన్మాండ్లు, బోనాల సుభాష్, వెంకట్‌రెడ్డి, నబీ తదితరులు పాల్గొన్నారు.

రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎండ్రియాల్‌లో ఆదివారం ఆవు ఒకే కాన్పులో ఒకేసారి రెండు దూడలకు జన్మనిచ్చిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన కర్ణాకర్ అనే రైతుకు చెందిన ఆవుకు రెండు దూడలు పుట్టడంతో రైతు ఆనందం వ్యక్తం చేశారు.

బస్టాండ్‌కు కంచె వేశారు..!



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని గోపాల్‌పేటలోని ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరడంతో అందులోకి ప్రయాణికులు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తగా అధికారులు ఇటీవల ముళ్లకంచె అడ్డుగా వేశారు. శిథిలావస్థకు చేరిన బస్టాండ్ పైకప్పు నుండి పెచ్చులూడి పడుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్టాండ్‌లోకి ప్రయాణికులెవరూ వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తగా ఇటీవల ముళ్లకంచెను అడ్డు వేశారు.

మద్నూర్ ఎస్సైగా కదిరే శ్రీకాంత్



మద్నూర్(జుక్కల్) : మద్నూర్ నూతన ఎస్సైగా కదిరే శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల కోసం ప్రజలు సహకరించాలని ఎస్సై కోరారు. కరీంనగర్ జిల్లాలోని మానకొండూర్ నుంచి మద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా బేడీల మైసమ్మ బోనాలు



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని గోర్గల్ గ్రామస్థులు బేడీల మైసమ్మ తల్లికి ఇంటింటికి బోనాలతో ఊరేగింపు ర్యాలీ చేపట్టారు. బ్యాండు మేళాలు, డీజే పాటలతో యువకులు నృత్యాలు చేస్తూ, ఆటా పాటలతో అమ్మవారికి బోనాలు తీశారు. కార్యక్రమంలో ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలు





గోపాల్‌పేటలో రాజకీయపార్టీల ఫ్లెక్సీలను తొలగింపజేస్తున్న జీపీ సిబ్బంది, లింగంపేటలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో ఆదివారం గ్రామ పంచాయతీ సిబ్బంది ఎన్నికలకోడ్‌ను అమలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారి వెంట విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వివిధ రాజకీయపార్టీల ఫ్లెక్సీలను గ్రామపంచాయతీ సిబ్బంది తొలగింపజేశారు.

ఫ్లెక్సీల తొలగింపు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎలక్షన్ కమిషన్ శనివారం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చింది. దాంతో ఆదివారం లింగంపేట మండల కేంద్రంలో ఆదివారం ఆయా పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా మండలంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో వాహనాల తనిఖీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో ఆదివారం ఏఫ్ఎస్‌టీ(ఫ్లయింగ్ స్క్వాడ్ టీం) అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా నుండి కామారెడ్డి జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

బాన్సువాడ : బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌కు చెందిన సుమారు 150 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, బస్వరాజ్, కాంత్‌రెడ్డి, ద్రోణవల్లి అశోక్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చూపాలి

బాన్సువాడ రూరల్ : పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ అభ్యర్థికి అత్యధిక మెజారిటీ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గం ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం దేశాయిపేట్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ భూనేకర్ ప్రకాష్, మాజీ సర్పంచ్‌లు పట్కారి విఠల్, భూనేకర్ జ్యోతితో పాటు పలువురు నాయకులు, కులసంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త మోరీల్ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, కొత్తకొండ భాస్కర్ తదితరులున్నారు.

ప్రమాదకరంగా మారిన గుంత



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మెంగారం రోడ్డు చాకలి వారి గల్లీలో మంచి నీళ్ల బావి ప్రక్కన మురికి కాల్వపై వేసిన కల్వర్టు ధ్వంసమై గుంత ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టుపై గుంత పడి నెలరోజులు గడుస్తున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడంలేదని వాపోతున్నారు. రాత్రివేళ గుంత కనిపించక నడుచుకుంటూ వెళ్లేవారు, బైక్‌పైన వెళ్లేవారు గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. గుంత మూడు రోడ్ల చౌరస్తాలో నడిరోడ్డుపై పడడంతో ప్రమాదకరంగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ అధికారులు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం



నిజాంసాగర్(జుక్కల్): బేడీల మైసమ్మ తల్లిదయతో జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని గోర్గల్ గ్రామ శివారులోని బేడీల మైసమ్మ దర్శించుకున్నారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ఎంపీ అభ్యర్థి బోనమెత్తుకొని పోతరాజులు కొరడా పట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి,నర్సింహారెడ్డి, యాటకారి నారాయణ, సాయిలు, పండరి, విఠల్‌రెడ్డి, కాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయాల్సిన బాధ్యత గ్రామస్థాయి నాయకులపై ఉందని మండలాధ్యక్షుడు రాంరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్‌హాల్‌లో వివిధ మోర్చాల అధ్యక్షుల ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఓబీసీ మోర్చా అధ్యక్షునిగా కటికె రమేశ్, ప్రభాకర్ రావు, బీజేవైఎం అధ్యక్షుడిగా డొల్లె కృష్ణ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా నేనావత్ చందర్, మహిళ మోర్చా అధ్యక్షులుగా మీనా, ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా బాలరాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి రవీందర్ రావు, మండల ప్రధానకార్యదర్శులు మార రమేశ్‌రెడ్డి, భూంరావు, ఉపాధ్యక్షులు మోహన్‌రాజ్ తదితరులున్నారు.

సంక్షిప్తం

గురుకులంలో దరఖాస్తుల ఆహ్వానం

రామారెడ్డి : రామారెడ్డి మండలంలోని ఉప్పల్వాయి గ్రామంలోని సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 2024–25కు గాను 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లుగా ప్రిన్సిపల్ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు www.tswreis.ac.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 23లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : పరీక్షల సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని ఎస్సై కొనారెడ్డి సూచించారు. మండల కేంద్రంలో 18 తేదీ నుంచి 30 వరకు జరగబోయే పదో తరగతి పరీక్ష ఉదయం 9.30 నుండి 12.30 వరకు జరుగుతాయన్నారు. గంట ముందే జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని తహసీల్దార్ దశరత్, ఎస్సై కోనారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిరాక్స్ సెంటర్ యజమానులకు నోటీసులిచ్చామన్నారు.

మల్కాపూర్‌లో వైద్యశిబిరం



బీబీపేట: మండలంలోని మల్కాపూర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, అరుణోదయ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని చావిడి వద్ద నిర్వహించిన వైద్య శిబిరంలో గ్రామంలోని 60 మందిని పరీక్షించి ఈసీజీ, బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు రక్త పరీక్షల నమూనాలను సేకరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ నాగరాజ్‌గౌడ్, పాండ్యన్, బాశెట్టి నాగేశ్వర్, స్వామి, శ్రీలత తదితరులున్నారు.

తైబజార్ వేలం పాట

బిచ్కుంద(జుక్కల్) : బిచ్కుంద గ్రామ పంచాయతీలో సోమవారం తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ. 2 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేక అధికారి తహసీల్దార్ ఆధ్వర్యంలో జీపీ ఆవరణలో వేలం పాటకు హాజరుకావాలని కోరారు.

బగలాముఖీ అమ్మవారి జన్మదినం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : పట్టణంలోని బగలాముఖీ అమ్మవారి పీఠంలో అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మాఘమాస అష్టమిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ తదితరులున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను ఆదివారం హైదరాబాద్‌లో సన్మానించినట్లు కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తోందన్నారు.